దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ.
3

Neti Velugu
నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
RNI NO. TELTEL/2023/88559
www.epaper.netivelugu.com
netivelugu63@gmail.com

రిపోర్టర్లు కావలెను
నేటి వెలుగు తెలుగు దినపత్రిక లో పనిచేయుటకు
రిపోర్టర్లు కావలెను
తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో
మరియు మండల హెడ్ క్వార్టర్స్ లో రిపోర్టర్లు కావాలి
ఆసక్తి గలవారు ఈ నెంబర్కు సంప్రదించండి:-
సంపాదకులు పామనగుండ్ల నవీన్ కుమార్ గౌడ్
9553276552.

నల్గొండ | సంపుటి : 3 | సంచిక : 3 | ఏప్రిల్ 4 శనివారం 2026 | పేజీలు : 4 | వెల రూ. 1.00/-
NALGONDA | VOL:3 | ISSUE: 3 | PAGES:4 | SATURDAY APRIL 4 2026 | Rs. 1:00

# 2047 నాటికి తెలంగాణను టెక్స్‌టైల్ రాజధానిగా మారుస్తాం: సీఎం రేవంత్ రెడ్డి

- టెక్స్‌టైల్ రంగంలో పెట్టుబడిదారులకు పూర్తి సహకారం అందిస్తామని సీఎం హామీ
- తెలంగాణలో తయారైన వస్త్రాలను ప్రపంచమంతా ధరించేలా చేస్తామన్న రేవంత్
- సినిమా పరిశ్రమ అవసరాలను స్థానికంగా తీర్చేలా ప్రోత్సాహం
- నాణ్యమైన పత్తి, మానవ వనరులు రాష్ట్రానికి ప్రధాన బలమని వెల్లడి



2047 నాటికి తెలంగాణను దక్షిణ ఆసియాకు టెక్స్‌టైల్ రాజధానిగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన ఏషియన్ టెక్స్‌టైల్ కాన్ఫరెన్స్ 2026లో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో తయారైన వస్త్రాలను ప్రపంచంలోని ప్రతి దేశంలో ప్రజలు ధరించేలా చేయాలన్నదే తన ఆశయమని అన్నారు. టెక్స్‌టైల్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే వారికి అన్ని రకాలుగా అండగా ఉంటామని సీఎం భరోసా ఇచ్చారు. పెట్టుబడిదారులకు అవసరమైన భూమి, విద్యుత్, నీరు, రాయితీలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, అనుమతులు కూడా వేగంగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. “మీకు విజన్ ఉంటే, మీకు సరైన భాగస్వాములం మేమే. కలిసికట్టుగా ప్రపంచాన్ని మార్చగల టెక్స్‌టైల్ వ్యవస్థను నిర్మిద్దాం“ అని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ వస్త్రాలకు ఘనమైన చరిత్ర ఉందని, పోచంపల్లి ఇక్కత్, గద్వాల చీరల నుంచి వరంగల్ దర్రీల వరకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని సీఎం గుర్తుచేశారు. దేశంలోనే అత్యధికంగా (మిగతా 2వ పేజీలో..)

## నిజమైన ఆటగాడు.. సంజూ శాంసన్‌ను చూసి నేర్చుకోండి: ప్రధాని మోదీ



టీమిండియా స్టార్ బ్యాటర్, కేరళ ఆటగాడు సంజూ శాంసన్‌పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్‌లో శాంసన్ కనబరిచిన అద్భుతమైన ఆటతీరును ఆయన కొనియాడారు. కేరళ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడిన ప్రధాని, కీలకమైన నాకౌట్ మ్యాచ్‌లలో శాంసన్ చూపిన ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, పట్టుదల అమోఘమని అన్నారు. జట్టుకు అవసరమైనప్పుడు అత్యుత్తమ ప్రదర్శన చేసేవాడే నిజమైన ఆటగాడని ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ... “ప్రస్తుతం క్రికెట్ సీజన్ నడుస్తోంది. కేరళ ప్రజలు కూడా సంజూ శాంసన్ ప్రదర్శన నుంచి నేర్చుకోవాలి. ప్రపంచకప్‌లో శాంసన్ ఆటతీరును మనం చూశాం. టోర్నమెంట్‌లో కీలకమైన నాకౌట్ దశ వచ్చినప్పుడు, అతని ప్రదర్శన అకస్మాత్తుగా శిఖర స్థాయికి చేరింది. టోర్నీ ఆరంభం నుంచి ముగింపు (మిగతా 2వ పేజీలో..)

## రెండు అఫిడవిట్‌లలో వేర్వేరు వివరాలు ఇచ్చిన నటుడు విజయ్!



తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో నటుడు, టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్నారు. ఆయన పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ స్థానాల్లో నామినేషన్ దాఖలు చేశారు. ఆయన రెండుచోట్ల దాఖలు చేసిన ఎన్నికల అఫిడవిట్‌లలో తేడాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికలకు ముందు ఈ వ్యవహారం న్యాయపరిశీలకు దారి తీసే అవకాశం ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ అసెంబ్లీ స్థానాల కోసం రూపొందించిన అఫిడవిట్‌లలో పెండింగ్ క్రిమినల్ కేసులు, ఎన్నికల (మిగతా 2వ పేజీలో..)

## లంబాడీల భూములు లాక్కొని జైల్లో పెట్టారు: హరీశ్ రావు

- లంబాడీల భూములు లాక్కొని జైల్లో పెట్టారు: హరీశ్ రావు
- గిరిజన రిజర్వేషన్లను పెంచిన ఘనత కేసీఆర్‌దేనన్న హరీశ్
- కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎస్టీలకు మోసం జరుగుతోందని మండిపాటు
- రాష్ట్ర సమస్యలను రేవంత్ గాలికి వదిలేశారని విమర్శ

నారాయణపేట జిల్లా బావోజీ జాతరలో పాల్గొన్న మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గిరిజనుల సంక్షేమం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన కృషిని వివరిస్తూ, ప్రస్తుత పాలనలో గిరిజనులకు అన్యాయం జరుగుతోందంటూ మండిపడ్డారు. గిరిజన రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచిన ఘనత కేసీఆర్‌దేనని, తండాలను (మిగతా 2వ పేజీలో..)



## చొరబాటుదారులు నాలుగు పెళ్లిళ్లు చేసుకోకుండా యూసీసీ అడ్డుకుంటుంది: అమిత్ షా



చొరబాటుదారులు నాలుగు పెళ్లిళ్లు చేసుకోకుండా ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) ద్వారా అడ్డుకునే వీలుంటుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. అసోంలోని గోల్‌పడా జిల్లాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడుతూ, ఆదివాసీల అభివృద్ధి కోసం ప్రధాని నరేంద్రమోదీ, అసోం ముఖ్యమంత్రి హిమంతబిశ్వ శర్మ రోడ్ మ్యాప్ సిద్ధం చేశారని అన్నారు. మోదీ నాయకత్వంలో ఆదివాసీ మహిళ దేశ ప్రథమ పౌరురాలు

## టీఆర్ఎస్ పేరును ఇప్పుడు ఎవరైనా ఉపయోగించుకోవచ్చు: కవిత

- తెలంగాణ రాష్ట్ర సమితి పేరు ఇప్పుడు ఎవరి చేతుల్లో లేదన్న కవిత
- పాత పేరు, కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తానని వెల్లడి
- బీఆర్ఎస్ ప్రస్తుతం నిద్రావస్థలో ఉందని విమర్శ

తెలంగాణ రాష్ట్ర సమితి పేరును ఇప్పుడు ఎవరి చేతుల్లో లేదని, ఆ పేరును ఎవరైనా ఉపయోగించుకోవచ్చని (మిగతా 2వ పేజీలో..)



## పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడిపే మీరా మాకు నీతులు చెప్పేది?



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల కేరళలో ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆ రాష్ట్ర సర్కారుపై చేసిన విమర్శనాత్మక వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, వాస్తవాలను తెలుసుకోకుండా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. సొంత రాష్ట్రంలో పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడిపే వ్యక్తి, సామాజిక పురోగతి గురించి కేరళకు పాఠాలు చెప్పడానికి ప్రయత్నించడం విడ్డూరంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. కేరళ సాధిస్తున్న (మిగతా 2వ పేజీలో..)

## ఒక్క వైసీపీ తప్ప అమరావతికి దేశమంతా మద్దతు ఇచ్చింది: సీఎం చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి పార్లమెంట్ ఉభయ సభల్లో చట్టబద్ధత లభించడం చరిత్రాత్మకమని, ఇది ఐదు కోట్ల ఆంధ్రుల విజయమని ముఖ్యమంత్రి చంద్రబాబు అభివర్ణించారు. ఈ సందర్భంగా ఉండవల్లిలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్ర విభజన నుంచి నేటి వరకు జరిగిన పరిణామాలను వివరించారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. 2024 జూన్ 2 నుంచి అమరావతి శాశ్వత రాజధానిగా ఉంటుందని, రాష్ట్రపతి ఆమోదంతో ఇది చట్టంగా మారి అమల్లోకి



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్
ఎడిటర్ & పబ్లిషర్

## 2047 నాటికి తెలంగాణను టెక్స్‌టైల్ రాజధానిగా మారుస్తాం: సీఎం రేవంత్ రెడ్డి

**(మొదటి పేజీ తరువాయి)**

నాణ్యమైన పత్తిని ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణకు ప్రపంచవ్యాప్త గుర్తింపు ఉందని తెలిపారు. వరంగల్‌లో ప్రపంచ స్థాయి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ అందుబాటులో ఉందని వివరించారు. హైదరాబాద్ ఫిల్మ్ ప్రొడక్షన్‌కు హబ్‌గా మారుతోందని, నెట్‌ఫ్లిక్స్ వంటి సంస్థలు ఇక్కడ స్టూడియోలు ఏర్పాటు చేస్తున్నాయని సీఎం అన్నారు. బాలీవుడ్‌తో పాటు ఇప్పుడు హాలీవుడ్ కూడా హైదరాబాద్ వైపు చూస్తోందని, సినిమా పరిశ్రమ ఫ్యాషన్ అవసరాలను స్థానికంగానే తీర్చేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రంలో గ్రీన్ టెక్స్‌టైల్ హబ్‌లను అభివృద్ధి చేస్తామని, యువతకు, ముఖ్యంగా మహిళలకు నైపుణ్య శిక్షణ ఇస్తామని రేవంత్ రెడ్డి వెల్లడించారు.

## నిజమైన ఆటగాడు.. సంజు శాంసన్‌ను చూసి నేర్చుకోండి: ప్రధాని మోదీ

**(మొదటి పేజీ తరువాయి)**

వరకు అతని ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతూనే ఉన్నాయి. జట్టుకు అతని అవసరం అత్యంత ఎక్కువగా ఉన్నప్పుడు, అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చాడు. ఇదే నిజమైన ఆటగాడికి ఉండాల్సిన లక్షణం" అని తెలిపారు. 2026 టీ20 ప్రపంచకప్‌లో భారత్ విజేతగా నిలవడంలో సంజూ శాంసన్ కీలక పాత్ర పోషించాడు. ఈ టోర్నీలో మొత్తం 5 ఇన్నింగ్స్‌లలో 80.25 సగటు, 199.37 స్ట్రైక్ రేట్‌తో 321 పరుగులు సాధించి "ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్" అవార్డును గెలుచుకున్నాడు. ఇందులో 27 ఫోర్లు, 24 సిక్సులు ఉన్నాయి. ఈ ప్రదర్శనతో ఒకే టీ20 ప్రపంచకప్ ఎడిషన్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత ఆటగాడిగా విరాట్ కోహ్లీ (2014లో 319 పరుగులు) రికార్డును శాంసన్ అధిగమించాడు. టోర్నీ ఆరంభంలో రెండు మ్యాచ్‌లలో పెద్దగా రాణించకపోయినా, సూపర్-8 దశ నుంచి శాంసన్ చెలరేగిపోయాడు. వెస్టిండీస్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో అజేయంగా 97 పరుగులు చేసి జట్టును గెలిపించాడు. ఆ తర్వాత సెమీఫైనల్‌లో ఇంగ్లండ్‌పై 89, ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై మరో 89 పరుగులతో జట్టు విజయంలో ముఖ్య భూమిక పోషించాడు.

## లంబాడీల భూములు లాక్కొని జైల్లో పెట్టారు: హరీశ్ రావు

**(మొదటి పేజీ తరువాయి)**

గ్రామ పంచాయతీలుగా మార్చి గిరిజనులకు స్వపరిపాలన అందించారని కొనియాడారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎస్టీల కోసం బడ్జెట్‌లో రూ. 2,730 కోట్లు కేటాయించి, కేవలం రూ. 50 కోట్లు మాత్రమే ఖర్చు చేయడం గిరిజనులను వంచించడమేనని మండిపడ్డారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లగచర్లలో లంబాడీల భూములను బలవంతంగా లాక్కుని వారిని జైల్లో పెట్టారని హరీశ్ ఆరోపించారు. కేసీఆర్‌కు పేరు వస్తుందనే అక్కసుతోనే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, ప్యాకేజీ-3 పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సమస్యలను గాలికొదిలేసి ముఖ్యమంత్రి కేరళలో గొప్పలు చెప్పుకుంటున్నారని హరీశ్ ఎద్దేవా చేశారు.

## రెండు అఫిడవిట్‌లలో వేర్వేరు వివరాలు ఇచ్చిన నటుడు విజయ్!

**(మొదటి పేజీ తరువాయి)**

బ్యాంకు ఖాతాలకు సంబంధించిన వివరాల్లో తేడాలు ఉన్నట్లు తెలుస్తోంది. పెరంబూర్ ఎన్నికల అఫిడవిట్‌లో తనపై ఎలాంటి కేసులు లేవని పేర్కొన్న విజయ్, తిరుచ్చి ఈస్ట్ కోసం సమర్పించిన అఫిడవిట్‌లో పెండింగ్‌లో రెండు ఎఫ్ఐఆర్‌లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల ఖర్చు కోసం ఒక బ్యాంకు ఖాతాను తెరిచామని, ఇందులో రూ. 1 లక్ష ఉన్నట్లు పెరంబూర్ అఫిడవిట్లో పేర్కొన్న విజయ్, తిరుచ్చి అఫిడవిట్లో రెండు బ్యాంకు ఖాతాలు ఉన్నట్లు తెలిపారు.

## చొరబాటుదారులు నాలుగు పెళ్లిళ్లు చేసుకోకుండా యూసీసీ అడ్డుకుంటుంది: అమిత్ షా

**(మొదటి పేజీ తరువాయి)**



అయ్యారని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో యూసీసీని బలవంతంగా రుద్దుతున్నారని కాంగ్రెస్ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. చొరబాటుదారులు అక్కడి ఆదివాసీ మహిళలను వివాహం చేసుకోవడం ద్వారా రాజకీయ పలుకుబడిని సంపాదించడానికి ప్రయత్నించారని, ఇది ఉద్రిక్తతలకు దారితీస్తోందని అన్నారు. తాము అధికారంలోకి వస్తే అక్రమ చొరబాట్ల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. అసోంలో తమకు మరో ఐదేళ్లు సమయం ఇవ్వాలని కోరారు. రాష్ట్రానికి పూర్తిగా చొరబాటుల నుంచి విముక్తి కలిగేలా చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. అసోంలో యూసీసీని అమలు చేస్తామని అమిత్ షా అన్నారు.

# టీఆర్ఎస్ పేరును ఇప్పుడు ఎవరైనా ఉపయోగించుకోవచ్చు: కవిత

**(మొదటి పేజీ తరువాయి)**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కవిత త్వరలో తన రాజకీయ పార్టీని ప్రకటించనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలంగాణ జాగృతి పేరు మీదనే పార్టీ పేరును ప్రకటించే అవకాశాలు ఉన్నాయని చాలామంది భావించారు. ఆ తర్వాత మరిన్ని పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. తాజాగా, ఆమె చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. ఆమె మీడియాతో మాట్లాడుతూ, పాత పేరు, కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తానని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సమితి పేరు (టీఆర్ఎస్) ఇప్పుడు ఎవరి సొంతం కాదని గుర్తు చేశారు. ఆచార్య జయశంకర్ సిద్ధాంతాల ప్రకారమే తమ పార్టీ నడుస్తుందని చెప్పారు. తమ పార్టీకి బీహార్ సిద్ధాంతకర్త అంటూ ఎవరూ లేరని అన్నారు. బీఆర్ఎస్ ప్రస్తుతం నిద్రావస్థలో ఉందని విమర్శించారు. పాతిక సంవత్సరాల క్రితం కేసీఆర్ స్థాపించిన తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌గా మారిన విషయం తెలిసిందే.

**ప్రైవేటు పాఠశాలల ఫీజులపై విమర్శలు**

రాష్ట్రంలో ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు 30 నుంచి 40 శాతం ఫీజులు పెంచడం మధ్య తరగతి తల్లిదండ్రులకు తలకు మించిన భారంగా మారుతోందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. ఇష్టారీతిన ఫీజులు వసూలు చేస్తున్న స్కూల్ యాజమాన్యాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. తక్షణమే ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. అధిక ఫీజుల వసూళ్లను కట్టడి చేయాలని కోరారు. ప్రైవేటు స్కూళ్లపై ఫీజు నియంత్రణ కమిటీ వేయాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం ప్రైవేటు పాఠశాలలు 8 శాతం నుంచి 10 శాతం పెంచుకోవచ్చని, కానీ 30 నుంచి 35 శాతం పెంచితే ఎలాగని ప్రశ్నించారు.

# ఒక్క వైసీపీ తప్ప అమరావతికి దేశమంతా మద్దతు ఇచ్చింది: సీఎం చంద్రబాబు

**(మొదటి పేజీ తరువాయి)**

వస్తుందని స్పష్టం చేశారు.

**పార్లమెంట్‌లో ప్రజా విజయం**

అమరావతికి రాజధానిగా చట్టబద్ధత కల్పించే ప్రక్రియలో పార్లమెంట్‌లో దాదాపు అన్ని పార్టీలు ఏకగ్రీవంగా మద్దతు తెలిపాయని చంద్రబాబు వివరించారు. కొన్ని పార్టీలు నేరుగా మద్దతు పలకగా, మిగిలినవి కూడా సహకరించాయని తెలిపారు. ఇది ప్రజా రాజధానికి దక్కిన గౌరవమన్నారు. ఈ చారిత్రాత్మక నిర్ణయానికి సహకరించిన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్‌తో పాటు మద్దతిచ్చిన అన్ని రాజకీయ పార్టీలకు, ఎంపీలకు ఐదు కోట్ల ప్రజల తరఫున మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.

**ఒక్క వైసీపీ తప్ప.. దేశమంతా ఏకతాటిపై**

దేశంలోని అన్ని పార్టీలు తమ రాజకీయ విభేదాలను పక్కనపెట్టి ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల కోసం, దేశ ప్రయోజనాల కోసం అమరావతికి మద్దతుగా నిలిచాయని చంద్రబాబు అన్నారు. కానీ, ఈ రాష్ట్రంలో ఓట్లు వేయించుకుని గెలిచిన వైసీపీ మాత్రం రాష్ట్రానికి ద్రోహం చేసిందని తీవ్రంగా విమర్శించారు. "దేశమంతా ఒక దారి అయితే, వీళ్లది ఇంకో దారి అయ్యే పరిస్థితి వచ్చింది. దేశ ప్రయోజనాలు అవసరం లేదు, రాష్ట్రం నాశనమైనా పర్వాలేదు, మేమనుకున్నదే జరగాలని పట్టుదలతో ఉన్నారు. మేము అమరావతికి శాసనం చేస్తే, వాళ్లు దానిని నాశనం చేయాలనుకున్నారు" అని చంద్రబాబు ఆరోపించారు.

**అమరావతి ఆవిర్భావం.. అప్పటి పరిస్థితులు**

2014లో రాష్ట్ర విభజన జరిగినప్పుడు రాజధాని, ఆదాయం లేక తీవ్ర ఆర్థిక కష్టాల్లో ఉన్నామని చంద్రబాబు గుర్తుచేశారు. ఆ క్లిష్ట సమయంలో, తనకున్న అనుభవంతో ఏడు ముంపు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేస్తేనే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తానని స్పష్టం చేయడంతో, కేంద్రం ఆర్డినెన్స్ ద్వారా ఆ ప్రక్రియను పూర్తి చేసిందన్నారు. అనంతరం, శివరామకృష్ణన్ కమిటీ నివేదిక, ప్రజాభిప్రాయం మేరకు విజయవాడ-గుంటూరు మధ్య గ్రీన్ ఫీల్డ్ రాజధానిగా అమరావతిని ఎంపిక చేశామని తెలిపారు. రైతుల త్యాగాలతో, ప్రపంచంలోనే ఆదర్శంగా నిలిచిన ల్యాండ్ పూలింగ్ ద్వారా 29 వేల మంది రైతులు స్వచ్ఛందంగా 34 వేల ఎకరాల భూమిని ఇచ్చారని, వారిని అభివృద్ధిలో భాగస్వాములను చేశామని వివరించారు.

**విధ్వంసం సృష్టించి.. భవిష్యత్తును దెబ్బతీశారు**

గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం అమరావతిపై కక్ష కట్టిందని, విధ్వంసకర రాజకీయాలతో రాష్ట్రాన్ని 30 ఏళ్లు వెనక్కి నెట్టిందని చంద్రబాబు ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజావేదికను కూల్చివేయడంతో విధ్వంసానికి నాంది పలికారని, అమరావతి పనులను నిలిపివేశారని మండిపడ్డారు. మూడు రాజధానుల డ్రామాతో ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టాలని చూశారని, సింగపూర్ కన్సార్టియం వంటి అంతర్జాతీయ సంస్థలపై అవినీతి ఆరోపణలు చేసి వెళ్లగొట్టారని విమర్శించారు. రైతులు 1631 రోజుల పాటు పోరాడితే వారిపై అక్రమ కేసులు పెట్టి హింసించారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ దుర్మార్గాల వల్లే రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయి, దక్షిణాది రాష్ట్రాల్లో అత్యల్ప తలసరి ఆదాయంతో నిలిచిందని అన్నారు.

**తిరిగి పట్టాలెక్కిన పనులు.. భవిష్యత్ ప్రణాళిక ఇదే**

ప్రజలు ఇచ్చిన అఖండ విజయంతో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల డబుల్ ఇంజన్ సర్కార్‌తో అమరావతి పనులు తిరిగి ప్రారంభమయ్యాయని చంద్రబాబు తెలిపారు. అమరావతిలో 9 ప్రత్యేక నగరాలు (గవర్నమెంట్, ఫైనాన్స్, నాలెడ్జ్, జస్టిస్, హెల్త్, స్పోర్ట్స్, టూరిజం, మీడియా, ఎలక్ట్రానిక్స్ సిటీలు) నిర్మిస్తామని పునరుద్ఘాటించారు. అమరావతి ఒక సెల్ఫ్ సస్టైనబుల్, ల్యాండ్ మానిటైజేషన్ ప్రాజెక్ట్ అని, దీని ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. 2028 నాటికి ఐకానిక్ భవనాలు, ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పూర్తి చేస్తామని, 2029లో ప్రధాని మోదీ చేతుల మీదుగా వాటిని ప్రారంభిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**ఇక శాశ్వతం.. ఎవరు ఆపలేరు**

పార్లమెంట్ చట్టబద్ధత కల్పించిన తర్వాత కూడా రాజధానిపై కొందరు అసంబద్ధ వ్యాఖ్యలు చేస్తున్నారని, "ఎక్కడ కూర్చుంటే అక్కడే రాజధాని" అనడం వారి తిక్కకు నిదర్శనమని చంద్రబాబు ఎద్దేవా చేశారు. అమరావతి అభివృద్ధిని ఎవరూ ఆపలేరని, ఇది అజేయం, అన్‌స్టాపబుల్, శాశ్వతం అని స్పష్టం చేశారు. అమరావతి, విశాఖపట్నం, తిరుపతి రీజియన్లను సమానంగా అభివృద్ధి చేస్తామని, 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలు వాస్తవాలను గ్రహించి, రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడిపే మీరా మాకు నీతులు చెప్పేది?

**(మొదటి పేజీ తరువాయి)**

సుస్థిర, సమ్మిళిత అభివృద్ధిని దెబ్బతీయాలనుకునే వారికి రేవంత్ రెడ్డి ఒక గొంతుకగా మారారని విజయన్ ఆరోపించారు. కేరళలో అవినీతి, దుష్పరిపాలన ఉందని ఆరోపించే ముందు రేవంత్ రెడ్డి అధికారిక గణాంకాలను పరిశీలించాలని పినరయి విజయన్ సూచించారు. "దేశంలోనే అత్యంత తక్కువ అవినీతి ఉన్న రాష్ట్రం కేరళ అని ఆయనకు తెలియదా? నీతి ఆయోగ్ ఎస్‌డీజీ ఇండెక్స్ (2023-24)లో కేరళ 79 పాయింట్లతో మొదటి స్థానంలో ఉంటే, తెలంగాణ ఆరో స్థానంలో ఉంది. మీ రాష్ట్రంలోని లోపాలను కప్పిపుచ్చుకోవడానికి కేరళను కించపరచడం చాలా విచారకరం" అని విజయన్ అన్నారు. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారమే కేరళలో పేదరికపు రేటు కేవలం 0.55 శాతం అని, ఇది దేశంలోనే అత్యల్పమని గుర్తుచేశారు. 2025 చివరి నాటికి తీవ్ర పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించిన తొలి రాష్ట్రంగా కేరళ నిలవబోతోందని తెలిపారు. అదే సమయంలో తెలంగాణలో పేదరికం 5.88 శాతంగా ఉందని, అక్కడి నిరుపేదలను ఆదుకోవాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదా? అని ప్రశ్నించారు. అంతేకాకుండా, కేరళలో అక్షరాస్యత 95.3 శాతం ఉండగా, తెలంగాణలో 76.9 శాతం వద్దే ఆగిపోయిందని విజయన్ చురకలంటించారు. కేరళలో శిశు మరణాల రేటు (ఐఎంఆర్) కేవలం 5గా ఉందని, ఇది అమెరికా (5.6) కన్నా మెరుగని పేర్కొన్నారు. కానీ తెలంగాణలో ఈ రేటు దాదాపు నాలుగు రెట్లు ఎక్కువగా ఉందని విమర్శించారు. తమ ప్రభుత్వ పాలనా నమూనాను రేవంత్ రెడ్డి విమర్శించడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని అన్నారు. "2025 సెప్టెంబర్ 1న, తెలంగాణకు చెందిన రెవెన్యూ, సర్వే ఉన్నతాధికారుల బృందం తిరువనంతపురం వచ్చి మా డిజిటల్ ల్యాండ్ రికార్డ్ సిస్టమ్ 'ఎంతే భూమి'ని అధ్యయనం చేసింది. ఒకవైపు మీ అధికారులు మా నమూనాను నేర్చుకోవడానికి వస్తుంటే, మరోవైపు మీరు బహిరంగంగా ఎగతాళి చేయడం ఎంతవరకు సమంజసం?" అని రేవంత్ రెడ్డిని విజయన్ ప్రశ్నించారు. కేరళ, కేంద్ర ప్రభుత్వాల మధ్య లాలూచీ ఉందని రేవంత్ చేసిన ఆరోపణను విజయన్ కొట్టిపారేశారు. కేరళ అభివృద్ధిని అడ్డుకునేందుకు కేంద్రం విధిస్తున్న ఆర్థిక ఆంక్షలపై, అప్పుల పరిమితిపై ఒక్క మాట కూడా మాట్లాడని కాంగ్రెస్ పార్టీయే బీజేపీకి నిజమైన 'బీ-టీమ్' అని ఆరోపించారు. ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు పదేపదే ఆలస్యం చేసే ప్రభుత్వం నడుపుతున్న ముఖ్యమంత్రి, కేరళకు నేర్పడానికి ఏమీ లేదని అన్నారు. పాలన, ప్రజా సంక్షేమం గురించి నిజమైన పాఠాలు నేర్చుకోవాలంటే తెలంగాణ ముఖ్యమంత్రిని కేరళకు సాదరంగా ఆహ్వానిస్తున్నామని పినరయి విజయన్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

# రిజర్వేషన్ సాధించకపోతే రాజీనామాకు సిద్ధం





**ముదిరాజ్ కార్పొరేషన్ ఛైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్**

**హైదరాబాద్, ఏప్రిల్( 3 ) నేటి వెలుగు:**

తెలంగాణలో ముదిరాజ్ సమాజం ఎదుర్కొంటున్న రిజర్వేషన్ సమస్యలు పరిష్కరించకపోతే తాను మంత్రి వాకిటితో కలిసి రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నానని రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ ఛైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ స్పష్టం చేశారు.శుక్రవారం హైదరాబాద్ బోయిగూడలో జరిగిన రాష్ట్ర ముదిరాజ్ జర్నలిస్టుల సంఘం అత్యవసర సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సమన్వయ కమిటీ ఏర్పాటు అవసరం, బీసీ–డి నుంచి బీసీ–ఏ లోకి వర్గీకరణ వ్యూహాలు, కోకాపేటలో ముదిరాజ్ భవన నిర్మాణం, జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ, స్వాతంత్ర్యం తర్వాత ముదిరాజ్ సమాజ అభివృద్ధికి ఎంతో కృషి జరిగినప్పటికీ, ఐక్యత లోపించడం వల్ల ఆశించిన ఫలితాలు రాలేదన్నారు. ప్రస్తుతం అనేక సంఘాలు ఏర్పడి కులాన్ని విభజిస్తున్నాయని, అందుకే అన్ని వర్గాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చే సమన్వయ కమిటీ అత్యవసరమని తెలిపారు.ఇటీవల ఈటెల, కాసాని, బండ ప్రకాష్, మంత్రి వాకిటి వంటి నాయకులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సర్పంచుల సన్మాన కార్యక్రమం నిర్వహించామని గుర్తుచేశారు. త్వరలో మీడియా, న్యాయ, మహిళ, యువజన విభాగాలతో సమగ్ర సమన్వయ కమిటీ ఏర్పాటు చేస్తామని చెప్పారు.కోకాపేటలో ముదిరాజ్ భవనానికి స్థలం ఉన్నప్పటికీ నిధుల కొరత ఉందని, సమాజం సహకరిస్తే నిర్మాణాన్ని పూర్తి చేస్తామని పేర్కొన్నారు.



జర్నలిస్టులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, రిజర్వేషన్ సాధనలో న్యాయపరమైన అడ్డంకులు తొలగించాల్సిన అవసరం ఉందని సూచించారు. సమన్వయ కమిటీని నియోజకవర్గం నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఏర్పాటు చేసి, స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని అభిప్రాయపడ్డారు.జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రత్యేక నిధి, మీడియా హబ్ ఏర్పాటు, ఉపాధి అవకాశాల పెంపు వంటి అంశాలపై కూడా చర్చ జరిగింది. భవిష్యత్తులో భారీ బహిరంగ సభ నిర్వహించి, సమాజ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించారు.ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు చింతల నిలకంఠం ముదిరాజ్, బోయిని శ్రీనివాస్ ముదిరాజ్, బలరాం ముదిరాజ్, మేడ్చల్ జిల్లా జర్నలిస్ట్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు సుగ్రీవ్ ముదిరాజ్,కాసాని రంజిత్ ముదిరాజ్, వెంకటేష్ ముదిరాజ్, పాండురంగం ముదిరాజ్, జే.శివ, ఎన్. శివ,బిక్షపతి ముదిరాజ్, బాబు ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ.





**సూర్యాపేట ఏప్రిల్ 03 నేటి వెలుగు ప్రతినిధి**

శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశం హాలు నందు బి సి వెల్ఫేర్ అధికారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా ఆయనకు పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి వీరమరణం పొందిన యోధుడిగా దొడ్డి కొమురయ్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని, ఆయన ధైర్యం, త్యాగం, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం మనకు స్ఫూర్తిదాయకం అని అన్నారు. రాజకీయ, సామాజిక రంగాలలో అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడిన కొమురయ్య గారి ఆశయాలు నేటికీ ప్రసంగించు కుంటున్నామని, రైతుల హక్కులు, పేదల సంక్షేమం కోసం ఆయన చేసిన త్యాగం ఎప్పటికీ మరువలేనిదన్నారు. ఈ సందర్భంలో యువత ఆయన జీవితం నుంచి స్ఫూర్తి పొందుతూ సమాజంలో న్యాయం, సమానత్వం కోసం కృషి చేయాలని,ఆయన చూపిన మార్గంలో నడుస్తూ ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాలని అన్నారు.బీసీ వెల్ఫేర్ అధికారి నరసింహులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం జనగాం జిల్లా దేవరుప్పుల మండలంలోని కడవెండి గ్రామంలో సాధారణ గొర్రెల పెంపకం దార్ల కుటుంబంలో జన్మించారు, తెలంగాణ సాయుధ పోరాటం ప్రారంభం మవడానికి భూమి కోసం భుక్తి కోసం, విముక్తి ఉద్యమంగా పోరాటం మారడానికి దొడ్డి కొమరయ్య అమరత్వమే ప్రధాన కారణమని ఆయన అన్నారు. అనంతరం వివిధ సంఘాల నాయకులు దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమం లో డిటిడిఓ శంకర్ వివిధ సంఘాల నాయకులు జి.సత్యనారాయణ, డాక్టర్ రామ్మూర్తి, చిన్న శ్రీరాములు, వి.సత్యనారాయణ, హుస్సేన్, రాజయ్య, లింగయ్య, పి.గామయ్య తదితర నాయకులు పాల్గొన్నారు సంబంధిత అధికారులు, తదితరులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ

**వనపర్తి జిల్లా ఏప్రిల్ 03 నేటి వెలుగు ప్రతినిధి**

నిరంకుశ పాలన నుంచి తెలంగాణ ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకునేందుకు ప్రాణాలను పణంగా పెట్టిన యోధుడు దొడ్డి కొమురయ్య అని బీసీ సంక్షేమ శాఖ అధికారి ముజాహిద్ కొనియాడారు. శుక్రవారం ఐ డి ఓ సి ఆవరణలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ అధికారి మాట్లాడుతూ నిరంకుశ పాలన నుంచి తెలంగాణ ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకునేందుకు ప్రాణాలను పణంగా పెట్టిన యోధుడు దొడ్డి కొమురయ్య అని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన త్యాగాన్ని, ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసుకున్నారు.తెలంగాణ సాయుధ పోరులో తొలి అమరుడైన కొమురయ్య ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది, ప్రజా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## చివరి క్షణాల్లో కూడా అండగా సేవా భారతి సేవకు ప్రజల ప్రశంసలు

**నల్గొండ ఏప్రిల్ 03 నేటి వెలుగు ప్రతినిధి**



నల్గొండలో మానవత్వం మళ్లీ ప్రాణం పోసుకుంది. సమాజంలో ఎవరూ లేని ఒక వృద్ధుడికి చివరి సంస్కారాలు చేయడానికి ముందుకు రావడం ద్వారా సేవా భావం ఏమిటో సేవా భారతి నల్గొండ మరోసారి నిరూపించింది.నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రిలో రాజశేఖర్ అనే వృద్ధుడు మరణించగా, ఆయనకు కుటుంబ సభ్యులు లేకపోవడంతో మృతదేహం అనాథలా మిగిలిపోయింది. ఈ విషయం తెలిసిన వెంటనే స్పందించిన సేవా భారతి సభ్యులు, సేవా భారతి అంబులెన్స్ ద్వారా మృతదేహాన్ని స్మశాన వాటికకు తరలించి, సంప్రదాయ పద్ధతిలో దహన సంస్కారాలు నిర్వహించారు.సమాజంలో ప్రతి మనిషి పట్ల బాధ్యతతో, కరుణతో ముందుకు వస్తూ సేవా భారతి చేస్తున్న ఈ సేవలను స్థానిక ప్రజలు హృదయపూర్వకంగా కొనియాడారు. మరణించిన వ్యక్తికి గౌరవప్రదంగా అంతిమ సంస్కారాలు చేయడం కూడా ఒక గొప్ప సేవ" అని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో సేవా భారతి జిల్లా అధ్యక్షులు శిరీష్ గారు, వంజర స్వామి, యోగి, భీమనపల్లి శ్రీకాంత్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. సేవే పరమో ధర్మః అనే సిద్ధాంతంతో ముందుకు సాగుతున్న సేవా భారతి, సమాజానికి ఒక ఆదర్శంగా నిలుస్తోంది.

## దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో సామాజిక తెలంగాణ సాధిద్దాం

- **వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన దొడ్డి కొమురయ్య 99వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్**

**హైద్రాబాద్ ఏప్రిల్ 03 నేటి వెలుగు ప్రతినిధి**



భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం భూస్వాములకు, దొరలకు ఎదురు నిలిచి వీరోచిత పోరాటం చేసి అసువులు బాసిన దొడ్డి కొమరయ్య 99వ జయంతి సందర్భంగా ఎల్బీ నగర్ లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా దేశ్ ముఖిలు, విసునూరు దొరల అరాచకాలకు వ్యతిరేకంగా ధైర్య సాహసాలతో దొడ్డి కొమరయ్య పోరాటం జరిపారని ఆనాడు ఆయన చూపిన పోరాటపటిమా నేటికీ ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు ఆనాడు వారి అరాచకాలకు బలి అయిన తొలి అమరుడు దొడ్డి కొమరయ అని అతని పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని సామాజిక తెలంగాణ సాధించాలని అన్నారు ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ ముదిరాజ్ మహేష్ యాదవ్ భాస్కర్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తా–కలెక్టర్ రాజర్షి షా

వినతి పత్రాన్ని అందజేసిన టీ.ఎస్.జె యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల్ అనిల్ కుమార్ జిల్లా నాయకులు

## అదిలాబాద్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక.

**అదిలాబాద్ జిల్లా ఏప్రిల్ 03 నేటి వెలుగు ప్రతినిధి:**



తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీ.ఎస్.జె.యు) జిల్లా నూతనంగా ఎన్నుకోబడిన కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ సమావేశ కార్యాలయంలో కలెక్టర్ రాజర్షి షా నీ మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్నీ అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నూతనంగా ఎన్నుకొబడిన జిల్లా అధ్యక్షుడు రాగం సుభాష్ ,ప్రధాన కార్యదర్శి మేడపట్ల సాయన్న, ఉపాధ్యక్షులు పసుపుల స్వామి లకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు జర్నలిస్టు లు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఇందులో ప్రధానంగా అర్హులైన జర్నలిస్టుల అందరికీ అక్రిడేషన్ కార్డులను మంజూరు చేయడం తోపాటు హెల్త్ కార్డులు అన్ని ప్రైవేటు ఆసుపత్రులలో చెల్లుబాటు అయ్యేవిధంగా చూడాలని, అర్హులైన జర్నలిస్టుల అందరికీ ఇల్లు,ఇంటి స్థలాలు ఇవ్వవలసిందిగా కోరారు.దీనిలో భాగంగా జర్నలిస్టులపై దాడులు జరుగుతున్న సందర్భంలో అటాక్స్ కమిటీని జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసి రక్షణ కల్పించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామని వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తాను అని బరోసా ఇచ్చారు. యూనియన్ కోశాధికారి అమృత్, ఒకే ప్రచార కార్యదర్శి మిలింద్, యూనియన్ గౌరవ అధ్యక్షులు నరేష్ కదం, సహాయ కార్యదర్శి ఆర్క సంతోష్ తో పాటు మిగతా సభ్యులు దీపక్ ఎముర్లవార్, అనిల్ పవర్, అడ్డిగం మోహన్, శంకర్ తదితరులు ఉన్నారు.

నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్



## నా అహమే మా బంధానికి కారణం.. ఐశ్వర్యతో బంధంపై అభిషేక్

బాలీవుడ్ స్టార్ జంట అభిషేక్ బచ్చన్, ఐశ్వర్య రాయ్ బంధంపై ఎప్పటినుంచో రకరకాల ఊహాగానాలు వస్తూనే ఉన్నాయి. వీరిద్దరూ విడిపోతున్నారని, విడాకులు తీసుకోబోతున్నారంటూ సోషల్ మీడియాలో తరచూ ప్రచారం జరుగుతుంటుంది. ఈ నేపథ్యంలో తన భార్య ఐశ్వర్యతో ఉన్న బంధం, కూతురు ఆరాధ్య పెంపకం గురించి అభిషేక్ బచ్చన్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మనసు విప్పి మాట్లాడారు. ఐశ్వర్యతో తన విజయవంతమైన భాగస్వామ్యానికి తన అహమే కారణమని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచారు.లిల్లీ సింగ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ... "నా తల్లిదండ్రులు పెళ్లి చేసుకున్నప్పుడు, మా నాన్న కంటే మా అమ్మే పెద్ద స్టార్. అందుకే భార్య విజయవంతంగా ఉండటం నాకు కొత్తేమీ కాదు. మా బంధం ఎప్పుడూ ఒక భాగస్వామ్యం లాంటిదే. కెరీర్ ప్రారంభం నుంచే నాకు ఐశ్వర్య తెలుసు. మేం మొదట్లో మంచి స్నేహితులం మాత్రమే" అని గుర్తు చేసుకున్నారు.'అహం' అనే పదాన్ని ఆయన నెగటివ్ అర్థంలో వాడలేదు. "నేను గెలవాలంటే నా భాగస్వామి పరుగు ఆపాల్సిన అవసరం లేదని నేను నమ్ముతాను. నా భర్తృత్వాన్ని నిరూపించుకోవడానికి నా భార్య తన పనిని ఆపేయాల్సిన అవసరం లేని బంధం నాకు కావాలి. అదృష్టవశాత్తు ఐశ్వర్య కూడా అలా ఆలోచించదు. అందుకే మా బంధానికి నా అహమే కారణం అన్నాను" అని అభిషేక్ వివరించారు. తన తండ్రి అమితాబ్ బచ్చన్ తనను లాంచ్ చేయలేదని, కానీ తర్వాత తన కోసం 'పా' చిత్రాన్ని నిర్మించారని గుర్తుచేశారు.తమ కుమార్తె ఆరాధ్య బచ్చన్ పెంపకం గురించి మాట్లాడుతూ, అభిషేక్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. "తల్లిదండ్రులలో తండ్రులు చాలా చెత్త టీచర్లు. ఎందుకంటే మా భావోద్వేగాలు అడ్డువస్తాయి. మహిళల్లో ఉండే సున్నితత్వం మాలో ఉండదు. మగవాళ్లు ఎక్కువగా చేతల ద్వారా తమను తాము నిరూపించుకోవాలనుకుంటారు" అని తెలిపారు."మా ఇంట్లో, ఆరాధ్యకు మేమిద్దరం ఉత్తమ ఉదాహరణగా నిలవాలని ప్రయత్నిస్తాం. పిల్లలకు ఇది తప్పు, ఇది ఒప్పు అని చెప్పేకంటే, మన ప్రవర్తనతో వారికి ఆదర్శంగా నిలవాలి. తల్లిదండ్రులు నైతిక విలువలతో జీవించినప్పుడు, పిల్లలు కూడా వాటిని చూసి నేర్చుకుంటారు. ఆ విధంగానే వారిని భవిష్యత్తుకు సిద్ధం చేయాలి. మా ఇంట్లో ఎవరు మగాడు, ఎవరు ఆడ అనే పోటీ ఎప్పుడూ ఉండదు" అని ఆయన స్పష్టం చేశారు. కాగా, అభిషేక్, ఐశ్వర్య 2007 ఏప్రిల్ 20న వివాహం చేసుకున్నారు. ఈ ఏడాదితో వారి వైవాహిక బంధానికి 19 ఏళ్లు పూర్తి కానున్నాయి.

## మగవాళ్లకు ఒక రూల్.. ఆడవాళ్లకు ఒక రూలా?": సమాజంపై మంచు లక్ష్మి ఫైర్

ప్రముఖ సినీ నటుడు మంచు మోహన్ బాబు తనయగా కాకుండా, నటిగా, నిర్మాతగా తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న మంచు లక్ష్మి ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఇటీవల 'ఆదిపర్వం', 'దక్ష' చిత్రాలతో అలరించిన ఆమె, మార్చి చివరి వారంలో 'లేచింది మహిళా లోకం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె, మన సమాజం మహిళలను చూసే దృక్పథంపై నిప్పులు చెరిగారు.సమాజం మహిళలను జడ్జ్ చేసే విధానాన్ని లక్ష్మి తప్పుబట్టారు. "మగవాళ్లు ఏదైనా బోల్డ్ నిర్ణయాలు తీసుకుంటే అది గొప్ప అని ప్రశంసిస్తారు. అదే ఆడవాళ్లు చేస్తే మాత్రం రకరకాలుగా మాట్లాడుకుంటారు. 'మేము చేస్తే సంసారం.. మీరు చేస్తే ఆ వ్యవహారం' అనే విధంగా ఉంటుంది. ఆ సామెతను నా నోటితో పూర్తిగా చెప్పను కానీ, మీకు అర్థమైందని అనుకుంటున్నాను" అని ఆమె చమత్కరిస్తూనే గట్టి కౌంటర్ ఇచ్చారు. ఆడవాళ్లు ఇలాగే ఉండాలి, ఇలాగే ప్రవర్తించాలి అని రూల్స్ రాసింది ఎవరని ఆమె ప్రశ్నించారు.తన వ్యక్తిగత జీవితానికి సంబంధించి ఒక ఆసక్తికర విషయాన్ని లక్ష్మి పంచుకున్నారు. "నా పెళ్లి సమయంలోనే నా భర్తకు ఒక మాట చెప్పాను. నువ్వు ఏ పని చేస్తావో.. అదే పని నేను కూడా చేయగలను అని గుర్తుంచుకోమన్నాను" అని తెలిపారు. తన మాటల ప్రభావమో ఏమో కానీ, తన భర్త ఏదైనా చేయడానికి జంకుతారని, తను చేస్తే లక్ష్మి కూడా చేస్తుందనే భయం ఆయన మనసులో ఉంటుందని ఆమె సరదాగా పేర్కొన్నారు.





# ధనుష్ సెట్‌లో చాలా నిశ్శబ్దంగా ఉంటాడు: సంయుక్త మీనన్

మలయాళ చిత్ర పరిశ్రమ నుండి వచ్చి, టాలీవుడ్‌లో వరుస విజయాలతో 'గోల్డెన్ లెగ్'గా గుర్తింపు తెచ్చుకున్న అందాల నటి... సంయుక్త మీనన్. బింబిసార, విరూపాక్ష వంటి చిత్రాలతో తెలుగు పరిశ్రమలో ఆమె స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. పవర్ స్టార్ పవన్ చిత్రం 'భీమ్లా నాయక్'తో సంయుక్త రేంజ్ నెక్స్ట్ లెవెల్ కి వెళ్లింది. తమిళనాడులో కూడా సంయుక్తకు భారీ ఫాలోయింగ్ ఉంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ... ధనుష్ సరసన 'సార్' (తమిళంలో వాతి) చిత్రంలో నటించిన అనుభవాన్ని ఆమె పంచుకుంది."ధనుష్ తో పనిచేయడం నాకు ఒక గొప్ప పాఠం లాంటిది. ఆయన సెట్‌లో చాలా నిశ్శబ్దంగా ఉంటారు. కానీ కెమెరా ముందుకు రాగానే అద్భుతమైన శక్తిని ప్రదర్శిస్తారు. ఆయన కథను ఎంచుకున్నారంటే అందులో కచ్చితంగా ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది" అని సంయుక్త ప్రశంసించింది. భవిష్యత్తులో మళ్ళీ ఆయనతో కలిసి నటించాలనే కోరికను ఆమె వ్యక్తం చేసింది.వెంకీ అట్లూరి దర్శకత్వంలో వచ్చిన 'సార్' చిత్రం విద్యా వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతూ రూ. 100 కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. ఇందులో మీనాక్షి అనే బోటనీ లెక్చరర్ పాత్రలో సంయుక్త ఒదిగిపోయింది. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, కథాబలమున్న సినిమాలను ఎంచుకోవడమే తన విజయ రహస్యమని ఆమె స్పష్టం చేసింది.

Edited, Published and owned by **PAMANAGUDNDLA NAVEEN KUMAR,** Printed at **SRI printers** at H.No. 1-47/1, Ganesh Nagar, Dandampelly, Nalgonda , Telangana State : Editor, **PAMANAGUDNDLA NAVEEN KUMAR** : **RNI No. TELTEL 2023/88559**, Cell : **9553276552,**